క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దబ్బిరాజుపేట గ్రామస్తులు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో బంగారమ్మ, పెద్దముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల నిర్మాణాలకు గ్రామస్తులు ఆది వారం శంకుస్థాపన చేశారు. పురోహితులు గోపాజోస్యుల సాయిశర్మ గ్రామపెద్దలు, పలువురు దంపతులతో పూజలు చేయించారు. దాత లు, గ్రామస్తుల సహకారంతో ఆలయాలను నిర్మించనున్నామని గ్రామపెద్దలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు గ్రామంలోని హడ్కో కాలనీలో డాక్టర్ పి.ఎస్.ఎన్.రాజు జ్ఞాపకార్థం ఆయన శిష్యుడు పొగిరి లక్ష్మణరావు ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ గేదెల శంకరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.

నలుగురు పందాల రాయుళ్ల అరెస్టు

కొత్తవలస: మండలంలోని చిన్నమన్నిపాలెం గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు కోడి పుంజులను, రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నివాళి

దత్తిరాజేరు: మండలంలోని చుక్కపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క మురళీ తల్లి సూరమ్మ పెద్ద కర్మను ఆ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. సూరమ్మ చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, జిల్లా నాయకుడు కడుబండి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

శృంగవరపుకోట: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు పల్లెవెలుగు బస్సులలో ఉచిత ప్రయాణ సౌక ర్యం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈసౌకర్యం పరీక్ష ఉన్న రోజు మాత్రమే అనుమతిస్తామని, విద్యార్థి ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి, పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి అనుమతిస్తారని, విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను కండక్టర్లకు చూపించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రూ.3.15 కోట్లతో గిరిజన గ్రామానికి బీటీరోడ్డు



కొండవానిపాలెం గ్రామానికి నిర్మించిన తారురోడ్డు

బొండపల్లి: మండల శివారు గిరిజన గ్రామం కొండవానిపాలెం ప్రజల ప్రయాణ అవస్థలు తీరాయి. దేవుపల్లి పంచాయతీ పరిధిలోని ఈ గ్రామానికి రూ.3.15 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర తారురోడ్డును నిర్మించారు. ఈ గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో మట్టిరోడ్డు మీదుగా వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వచ్చేది. తారురోడ్డు నిర్మించాలని గత ప్రభుత్వంలో పాలకులను గ్రామస్తులు కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. గ్రామస్తుల సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఉన్నతాధికారులతో పాటు,ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. రోడ్డు పనులు పూర్తికావడంతో కొండవానిపాలెం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కనుల పండువగా అమ్మవార్ల జాతర



గంట్యాడ: గంట్యాడలో సిరిమానును అధిరోహిస్తున్న పూజారి కొండబాబు

- వైభవంగా చీపురుపల్లి కనకమహాలక్ష్మి జాతర ప్రారంభం
- జామిలో ఎల్లారమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పలుగ్రామాల్లో ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం



చీపురుపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తురాలు

చీపురుపల్లి: పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి డీఎస్పీ ఏ.ఎస్. చక్రవర్తి పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. జాతరలో ముగ్గురు డీఎస్పీలు, 8మంది సీఐలు, 42 మంది ఎస్‌ఐలతో పాటు దాదాపు 800 మంది సిబ్బందితో మూడు రోజుల పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు.

జన సంద్రమైన జామి

జామి: ఎల్లారమ్మ జాతర నేపథ్యంలో జామి జనసంద్రమైంది. జముకులపాటతో ఆనవాయితీగా శనివారం రాత్రి 8.50 గంటలకు అనువంశీకులు ఇంటి వద్ద నుంచి అమ్మవారిని గద్దె దింపి ఊరేగించి తెల్లవారు జామున 2: 30 గంటల సమయంలో అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చారు. ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం రెండో రోజు జాతర ఘనంగా నిర్వహించారు. సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కిలో మీటర్ల మేర భక్తులు బారులు తీరారు. రెండో రోజు అమ్మవారు లక్ష్మీస్వరూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎల్లారమ్మ పండగనుతో పాటు లక్ష్మీపురం, జన్నివలస, విజినిగిరి, లొట్లపల్లి, జె.డి.వలస చుట్టుపక్క గ్రామాల వారు జరుపుకున్నారు. ఆడపిల్లలు, బంధువులతో ఆయా గ్రామాలు కళకళలాడాయి. జాతరలో జామి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల వారు భక్తులకు మజ్జిగ,తాగునీరు, పులిహోర పంపిణీ చేశారు. పోలీసలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిరిమాను సంబరం

గంట్యాడ: మండల కేంద్రంలో ఎల్లమాంబ సిరిమానోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. డప్పుడు వాయిద్యాలు, మేళ తాలాల మధ్య పూజరి కొండ బాబు అమ్మవారి శతకం పుట్ట వద్ద సిరిమానును అధిరోహించారు. సిరిమానోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లితో పాటు నెలివాడ గ్రామాల్లో ఎల్లమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామాల్లో పోతన్నలు ఘటాలను ఊరేగించారు. అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఘటాలకు, అమ్మవారికి ఆయా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బొండపల్లిలో సిరిమానో త్సవం నిర్వహించారు. అమ్మవారు ఘటాలుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభుజీరాజు, వైస్ ఎంపీపీ గిండేల ఈశ్వరరావు, సర్పంచ్‌లు తాళ్లపూడి కీర్తి, బొండపల్లి ఈశ్వరరావు, నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పూజలు చేశారు.

పల్లిగండ్రేడులో..

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో ఎల్లమ్మ జాతరను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం సిరిమానును ఊరేగించారు.



చీపురుపల్లి: భక్తులతో నిండిపోయిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం



చీపురుపల్లి: రావి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



చీపురుపల్లి: మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



బొండపల్లి: నెలివాడలో ఎల్లమ్మ తల్లి ఘటాలను మోస్తున్న పూజారి



జామి: చల్లగా చూడమ్మ అంటూ ఎల్లారమ్మను మొక్కుతున్న భక్తులు



జామి : ఎల్లారమ్మ జాతరలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నదళితమహాసభ జిల్లా అధ్యక్షుడు అప్పారావు



గుర్ల: పల్లిగండ్రేడులో ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



జామి: ఎల్లారమ్మ తల్లి ప్రతిమలకు పూజలు చేస్తున్న మహిళలు



చీపురుపల్లి: జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దంపతులకు కనకమహాలక్ష్మి అమ్మవారి ఫొటోను బహూకరిస్తున్న ఆలయ కమిటీ



చీపురుపల్లి: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావుకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ కమిటీ



చీపురుపల్లి: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు అమ్మవారి ఫొటో అందజేస్తున్న ఆలయ కమిటీ

అభివృద్ధి చేశాం.. సంక్షేమం అందించాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- టిక్కెట్ ఖరారు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం..ఆశీర్వదించండి
- గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: అయిదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గజపతినగరం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేశామని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ తనపై నమ్మకంతో రెండోసారి గజపతినగరం అసెంబ్లీ స్థా నం నుంచి పోటీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని, ఆయనకు తన కృతజ్ఞతలు తెలిపారు.ఈ అయిదేళ్లలో గజపతినగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమా లు చేశామని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి పనులను చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, రోడ్డు విస్తరణ, 30 పడకల సామాజిక ఆస్పత్రిని 100పడకల స్థాయికి పెంచి నూతన భవనాల నిర్మాణం, బైపాస్ రోడ్డు నిర్మాణం చేశామని తెలిపారు. నాడు-నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చామని, సచివాలయా లు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ, వైద్య సేవలను చేరువచేశామని వివరించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించామని చెప్పారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరా జు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, పార్టీ సీనియర్ నాయకులు పి.నారాయణమూర్తి, రేగ సురేష్, కె.సుబ్రహ్మణ్యం, కె.రామునాయుడు, కర్రి నానాజీ, ఆల్తి రామునాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ క్రీడాకారులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడతాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వడ్డిపేట గ్రామంలో గ్రామ దేవత పండగ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలకలో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం-ఆంధ్ర' పేరిట రాష్ట్ర వ్యాప్త టోర్నమెంట్‌ను ఇటీవల నిర్వహించారన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ విజేతకు రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, నాయకులు బి.ఏ.నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి



రామలింగాపురంలో బెల్లాన చంద్రశేఖర్‌కు తిలకం దిద్ది, హారతులు పడుతున్న మహిళలు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాయని, మీకు మేలు జరిగిందంటే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజయనగరం పార్లమెంటు అభ్యర్థి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం విజయనగరం పార్లమెంటు అభ్యర్థిగా ఆయన్ని ఎంపిక చేయడంతో ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభిం చారు. గరివిడిలోని మాజీ సర్పంచ్ బమ్మిడి అప్పలస్వామి, కృష్ణవేణి దంపతుల నివాసానికి వెళ్లి అక్కడి నుంచి ప్రచారం ప్రారంభించారు. అనంతరం చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని పిల్ల పేట, మండలంలోని రామలింగాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. రామలింగాపురం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ బెల్లానకు మహిళలు ఘనస్వాగతం పలికి, తిల కం దిద్ది, హారతులు పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అయిదేళ్ల నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. లంచాలు, మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందజేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా తనను మరోసారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య బోధించాలి



జ్యోతి వెలిగించి పాఠశాల వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర

కొత్తవలస: పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర సూచించారు. స్థానిక సబ్బవరం రోడ్డులోని విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. అతిథి గా హాజరైన జడ్జి విజయచంద్ర మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలువలు నేర్పినప్పుడే సమాజంలో నేరాలు తగ్గుతాయన్నారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీవీకే సంస్థల పరిపాలన అధికారి కన్నన్, వైద్యులు తెన్నేటి సుబ్బారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

కడుబండి విజయానికి కృషి చేయాలి

వేపాడ: ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును పార్టీ ప్రకటించడం హర్షనీయమని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మన నియోజకవర్గ ప్రజలపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు, ప్రజా ప్రతి నిధులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు అంతా కలిసి కడుబండి విజయానికి కృషి చేయాలని కోరారు. కడుబండిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని సీఎం జగన్‌కు గిఫ్ట్‌గా అందిద్దామని, దీని కోసం ఇప్పటి నుంచే ఐక్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కడుబండికి మరోసారి పార్టీ టికెట్ ఇచ్చిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వేపాడ మండలానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.